నమస్తే తెలంగాణ
మెదక్
13 | హైదరాబాద్, సోమవారం 19 ఫిబ్రవరి 2024 | MEDAK



కొమురవెల్లి మల్లన్న ఆలయంలోని గంగరేగు చెట్టు వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కేజీబీవీల్లో యాక్షన్ ప్లాన్

పది, ఇంటర్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కార్యాచరణ

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- స్పెషల్ క్లాసులు, గ్రాండ్ టెస్ట్‌లతో పర్యవేక్షణ
- మెదక్ జిల్లాలో 15 కేజీబీవీలు
- అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం

మెదక్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): విద్యార్థి జీవితంలో పది, ఇంటర్ పరీక్షలు కీలకం. వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు పడేది కూడా ఇక్కడే. మెదక్ జిల్లాలో పది, ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధించడంపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. స్టడీ ప్లానింగ్, వారాంతపు పరీక్షలు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన పిల్లలను కనీస మార్కులతో గట్టెక్కించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సీఆర్‌పీ, పీజీటీలు, స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈ మేరకు కేజీబీవీల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసి అమలుకు శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులతో పాటు వారాంతంలో గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సర్వ శిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారులు 100 రోజుల ప్రణాళిక తయారు చేశారు. యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఉదయం 5 నుంచి 5.30 గంటల వరకు ప్రైవేట్ టైమ్.. 5.30 నుంచి 7.30 వరకు సబ్జెక్ట్ ప్రిపరేషన్, 7.30 నుంచి 8.00 వరకు ఫ్రీ టైం, 8.30 నుంచి 9 వరకు బ్రేక్ ఫాస్ట్, 9 గంటలకి ప్రేయర్, 9.20 నుంచి 12.30 వరకు తరగతులు, 12.30 నుంచి 1.15 వరకు లంచ్, 1.30 నుంచి 4.30 వరకు సబ్జెక్టుల వారీగా తరగతులు, సాయంత్రం 4.30 నుంచి 5.15 వరకు స్నాక్స్, 5.15 నుంచి స్పోర్ట్స్, 6.20 నుంచి 7 గంటల వరకు డిన్నర్, రాత్రి 7 నుంచి 10.30గంటల వరకు ఇంటర్మీడియెట్ విద్యార్థులతో కలిపి స్టడీ అవర్ ఉంటుంది.

మెదక్ జిల్లాలో 15 కేజీబీవీలు

మెదక్ జిల్లాలో 15 కేజీబీవీలు ఉండగా, వీటిల్లో 510 మంది పదో తరగతి, 282 మంది ఇంటర్ మొదటి సంవత్సరం, 192మంది రెండో సంవత్సరం చదువుతున్నారు. వీరిలో కొంతమంది విద్యార్థులను కేజీబీవీల్లో పనిచేసే స్పెషల్ ఆఫీసర్లతో పాటు సీఆర్‌టీ, పీజీటీలు దత్తత తీసుకొని చదివిస్తున్నారు. వారు ఎలా చదువుతున్నారు?. ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారనే అంశాలను పరిశీలిస్తారు. ఎక్కడ ఇబ్బందులన్నాయో గుర్తించి వాటిని అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. కేజీబీవీల జీఈసీవో సుకన్య ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.

కేజీబీవీలో విద్యార్థులకు స్టడీ అవర్ నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి

ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి రోజూ ఒకటి రెండు కేజీబీవీలను సందర్శిస్తూ ప్రత్యేక సూచనలు, సలహాలు ఇస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులతో పాటు వారాంతంలో గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నాం. వీలైనంత ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సుకన్య, జీఈసీవో

మంచి ఫలితాలు సాధించాలి

పది, ఇంటర్‌లో మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలి. కేజీబీవీల్లో ప్రణాళిక పక్కాగా అమలు చేయాలి. జిల్లాలోని 15 కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్‌టీలు, పీజీటీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన సిబ్బంది, అత్యుత్తమ మార్కులు పొందిన విద్యార్థినీ, విద్యార్థులను కలెక్టర్ చేతుల మీదుగా సన్మానిస్తాం.

– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి, మెదక్

మల్లన్నకు జనహారతి

వైభవంగా కొమురవెల్లి ఆలయ బ్రహ్మోత్సవాలు

- ఐదో ఆదివారానికి 30వేల మంది హాజరు
- పట్నాలు వేసి, బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- మల్లన్న దర్శనంతో పులకించిన భక్తజనం

భక్తి పారవశ్యంలో భక్తులు

స్వామివారి సేవలో పూజారులు

చేర్యాల, ఫిబ్రవరి 18: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల ఐదో వారానికి కరీంనగర్, మెదక్, వరంగల్ పూర్వపు జిల్లాల నుంచి సుమారు 30వేల మందికి పైగా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మల్లన్న నామస్మరణతో ఆలయం మార్మోగింది. శనివారం రాత్రి నుంచే మొదలైన భక్తుల రాక ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. భక్తులు కోనేరులో స్నానాలు ఆచరించి క్యూ ద్వారా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్,ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఒగ్గు పూజారులు, సిబ్బంది విధులు నిర్వర్తించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

వీఐపీ పాస్‌ల రికార్డుల పరిశీలన...

ఇటీవల వీఐపీ పాస్‌లను కొందరు పక్కదారి పట్టించిన విషయం వెలుగుచూడడంతో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆలయవర్గాలు వీఐపీ పాస్‌ల జారీని కఠినతరం చేశాయి. వీఐపీ పాస్‌ల జారీ కేంద్రం వద్ద ఆదివారం సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై నాగరాజుతో కలిసి ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి రికార్డులను పరిశీలించారు. ప్రతి ఆదివారం పాస్‌ల జారీ చేస్తూ నమోదు చేస్తున్న వివరాలను సీఐ అడిగి తెలుసుకున్నారు. పాస్‌ల జారీ విషయంలో ఆలయ అధికారులు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

భక్తి పారవశ్యంలో చిన్నారులు

పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

విద్యతోనే బంగారు భవిష్యత్తు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

అమీన్‌పూర్, ఫిబ్రవరి 18: విద్యతో ఏదైనా సాధించవచ్చని, నేటి ప్రపంచంలో విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బంధంకొమ్ము కాలనీలో ఎల్లీబడ్జ్ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. చదువు మనిషి ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచి ఏకాగ్రతతో విద్యనభ్యసించాలన్నారు. చిన్నతనం నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా కృషిచేయాలని విద్యార్థులకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, అనిల్‌కుమార్, అదర్శ్‌రెడ్డి, నగేశ్‌యాదవ్, కౌన్సిలర్లు బిజిలి రాజు, చౌటకూరి మహిపాల్‌రెడ్డి, పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అమీన్‌పూర్‌లో ఎల్లీబడ్జ్ పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీమంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు, విద్యార్థుల తల్లిదండ్రులతో హరీశ్‌రావు

అయోధ్యలో టీటీడీ ఈవోతో అమర్నాథ్ అన్నదాన సేవాసమితి సభ్యులు

లంగర్‌ను సందర్శించిన టీటీడీ ఈవో

సిద్దిపేట కమాన్, ఫిబ్రవరి 18 : అయోధ్యలోని లంగర్‌లో సిద్దిపేటకు చెందిన అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి వారు భక్తులకు అల్పాహారం అందిస్తూ తమవంతు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఆదివారం టీటీడీ ఈవో ధర్మారెడ్డి లంగర్‌కు రాగా అమర్నాథ్ అన్నదాన సేవాసమితి పక్షాన ప్రధాన కార్యదర్శి నేతి కైలాసం, పీఆర్‌వో కుమ్మరికుంట రమేశ్, నేతి భ్రమరాంబ, కుమ్మరికుంట దీప, చీకోటి లక్ష్మి ఆహ్వానించి వారికి అల్పాహారం అందించారు.

మేడారం జాతర స్పెషల్

నేటి నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు

హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

- మహిళలకు ఉచిత ప్రయాణం
- హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు
- స్థానిక బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రత్యేక శిబిరం

హుస్నాబాద్, ఫిబ్రవరి 18: వనదేవతలు సమ్మక్క–సారలమ్మ మేడారం జాతరకు 67 ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు హుస్నాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జాతర బస్సుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. పురుషుల్లో పెద్దలకు రూ.350లు, చిన్నారులకు రూ.190 టికెట్ ధర ఉందన్నారు. హుస్నాబాద్ బస్టాం డ్ నుంచి నేరుగా మేడారం జాతరలో అమ్మవారి గద్దెలకు అతి సమీపంలో భక్తులను దించుతామన్నారు. రోజుకు కనీసం 5 వేల మంది భక్తులను తరలించేలా చర్యలు తీసుకున్నామన్నారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో మెడికల్ క్యాంపు, తాగునీటి సౌకర్యం, పోలీసు బందోబస్తు సౌకర్యాలు కల్పించామన్నారు. జాతరకు వెళ్లలేని భక్తులు రూ.299 చెల్లిస్తే అమ్మవారి పసుపు, కుంకుమ, ప్రసాదం ఇంటికే పంపించే ఏర్పాట్లు చేశామని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిపో ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యం
- వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ
- మెడక్ జిల్లా టేక్మాల్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

టేక్మాల్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, గురుకుల ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. మౌలిక సదుపాయల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ భవనం మరమ్మతులకు రూ. 70లక్షలతో శంకుస్థాపన చేశారు. పాఠశాల అభివృద్ధి కోసం అదనంగా మరో రూ. కోటి 50 లక్షలు మంజూరు చేయాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిణి బాలామణి కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. రూ. 50 లక్షలతో చేపట్టనున్న ఆదర్శ పాఠశాల మౌలిక వసతుల కల్పన పనుల కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని, అందుకు అదనంగా రూ. కోటీ 50లక్షలు మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి మంత్రికి విన్నవించగా నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. గిరిజన పాఠశాల విద్యార్థుల మౌలిక వసతుల కోసం రూ. 35 లక్షలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని వెల్లడించారు. ఇప్పటికే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఆరోగ్య శ్రీ కింద సుమారు 18 రకాల రోగాలను నయం చేసే విధంగా రూ.10 లక్షలతో ఉచిత ఆరోగ్య సేవలను అందిస్తామన్నారు. విద్యా, వైద్యాన్ని ప్రతి పేదవాడికి ఉచితంగా అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజలకు నాణ్యమైన, ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని మంత్రి వెల్లడించారు. మారుమూల ఎల్లుపేట గ్రామంలో వైద్య ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో అంబదాసు రాజేశ్వర్, ఎస్‌సీ,ఎస్‌టీ అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో చందూనాయక్, తహసీల్దార్ కృష్ణ, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లుపేట పీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

కేజీబీవీ పాఠశాలలో మౌలిక సదుపాయల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

ఆలయాల్లో భక్తుల సందడి

- ఏడుపాయలకు తరలివచ్చిన భక్తులు.. మంజీరా నది పాయల్లో పుణ్యస్నానాలు
- వర్గల్ విద్యాసరస్వతీమాత, నాచగిరి లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న భక్తులు



పాపన్నపేట: ఏడుపాయల్లో అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

వర్గల్/పాపన్నపేట, ఫిబ్రవరి 18: పవిత్ర పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గాభవానీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నది పాయల్లో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించారు. వర్గల్ విద్యాసరస్వతీమాత, నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయాల్లో భక్తులు ఆదివారం పూజలు చేశారు. సెలవుదినం కావడంతో దేవతామూర్తులను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తీర్థప్రసాదాల స్వీకరణ అనంతరం మహాఅన్నప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు.

వర్గల్: లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు